సాక్షి తిరుపతి

గురువారం । 4 । జూలై । 2024



'పామ్'లో లేని ధర!

ఆయిల్ పామ్ ధరలు తిరోగమనం బాట పట్టాయి. గత ఏడాది కంటే దాదాపు 40శాతం తగ్గాయి. - 8లో



బాధ్యతాయుతంగా విధులు

పోలీసులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎస్పీ సూచించారు. - 8లో



ఆధునిక పద్ధతులతో అగ్రపథం

ఆధునిక విధానాలు పాటించడం వల్లే పాల ఉత్పత్తిలో ఏపీ అగ్రపథంలో పయనిస్తోందని వర్షా జోషి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

'ఎన్‌టీఏ'లో సంస్కరణలు అవసరం



ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ఎన్‌టీఏ (నేషనల్ టెస్ట్ ఏజెన్సీ)లో వ్యవస్థాగతంగా తక్షణ సంస్కరణలు అవసరమని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు. బుధవారం ఆయన పార్లమెంట్ సమావేశంలో మాట్లాడారు. వైద్య విద్యను అభ్యసించేందుకు సుమారు 2.4 కోట్ల మంది విద్యార్థులు 'నీట్' ద్వారా పోటీ పడుతున్నారన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతను ఎన్‌టీఏ భుజానకెత్తుకుందని చెప్పారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయన్న ఆరోపణలు ఆందోళన రేకెత్తిస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలు నీట్ పరీక్ష కోసం కఠినమైన అభ్యసన, విలువైన సమయం, పెట్టుబడిగా పెట్టిన అసంఖ్యాక విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌టీఏ వైఫల్యంతో వైద్య విద్యను అభ్యసించాలనుకునే వారు ఆత్మ విశ్వాసం కోల్పోతారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్‌టీఏలో సంస్కరణలు తీసుకువచ్చి విద్యార్థులకు మంచి భవిష్యత్ కల్పించాలని కోరారు. అనంతరం నీట్ పరీక్ష విధానంపై సీబీఐ విచారణను ప్రారంభించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర విద్యా శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి అర్బన్ : కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. బుధవారం సాయంత్రం తిరుపతికి విచ్చేసిన ఆయనకు జేసీ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ పెంచల కిషోర్, జిల్లా సమాచారశాఖ అధికారి బాలకొండయ్య తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం కలెక్టరేట్‌లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

6న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి. శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అశోక్ లేలాండ్, పేటీఎం వంటి ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు 75 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఉదయం 10గంటలకు వర్సిటీలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని తెలియజేశారు. వివరాలకు 953388902, 7989810194 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల

కళాశాల	కోడ్
పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల	18195
ఎస్వీ ఆర్ట్స్ కళాశాల	20132
ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల	17656

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కళాశాలల కోడ్ ఆధారంగా అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్, ఎస్వీడబ్ల్యు కళాశాలల్లో సుమారు 21 విభాగాలలో వెబ్‌ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశముంది. బీఏ ఆనర్స్ గ్రూప్‌లో చేరదలచిన విద్యార్థులు అడ్మిషన్ల సమయంలో రూ.5,400 ఫీజు చెల్లించాలి. అదేవిధంగా బీఎస్సీ ఆనర్స్ గ్రూప్‌లో ఆరు స్పెషలైజేషన్ సబ్జెక్టులకు రూ.5,600, డేటా సైన్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, కంప్యూటర్ సైన్స్ స్పెషలైజేషన్ సబ్జెక్టులను ఎంపిక చేసుకునే విద్యార్థులు రూ.11,045 చెల్లించాల్సి ఉంటుంది. బీకామ్ ఆనర్స్ (జనరల్) కోర్సు కోసం రూ.5,400, బీకామ్ ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు కోసం రూ.10,845 ఫీజు చెల్లించాలని ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు తెలిపారు.

మైకా.. కేక!

మైకా గనులకు మంచిరోజులు వచ్చాయి. నాణ్యమైన అభ్రకం కొనుగోలు చేసేందుకు ప్రపంచదేశాలు పోటీపడుతున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో లభించే నంబర్‌వన్ ఖనిజం కోసం అధిక మొత్తంలో ధర చెల్లించేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడిప్పుడే మైకా గనులు ఊపిరిపోసుకుంటున్నాయి. పెట్టుబడి భారంతో వెనకడుగు వేసిన మైన్స్ యాజమాన్యాలు సైతం ఉత్సాహంగా తవ్వకాలకు శ్రీకారం చుడుతున్నాయి. మళ్లీ పూర్వ వైభవం సంతరించుకునే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నాయి. వేలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.



మైకా వెలికి తీస్తున్న కార్మికులు

- అభ్రకం ఖనిజానికి పెరిగిన డిమాండ్
- దేశవిదేశాల్లో మంచి గిరాకీ
- గనుల నిర్వహణకు శ్రీకారం చుట్టిన యాజమాన్యాలు
- అండర్ గ్రౌండ్ మైనింగ్‌కు సైతం ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలు
- వేలాది మంది ఉపాధి పొందే అవకాశాలు

సైదాపురం : జిల్లాలోని గనుల్లో లభించే మైకా (అభ్రకం) ఖనిజానికి విదేశాల్లో మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రపంచంలోనే మరెక్కడ దొరకని నాణ్యమైన మైకా ఇక్కడే దొరుకుతోంది. విద్యుత్, అణు పరీక్షలకు మైకాను ప్రధానంగా ఉపయోగిస్తుంటారు. రూ.కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే అభ్రకం గనులకు దేశంలోనే ఉమ్మడి నెల్లూరు జిల్లా పెట్టింది పేరు. ఇప్పుడు మైకాకు విపరీతమైన గిరాకీ రావడంతో స్థానికంగా ఉన్న అభ్రకం పరిశ్రమకు మంచిరోజులు వచ్చినట్టే అని గనుల యజమానులు వెల్లడిస్తున్నారు.

నిల్వలు కనిపెట్టడమే కష్టం


ప్రపంచంలో ఎక్కడ ఏం జరుగుతోందో.. ఏ ప్రాంతంలో ఏయే ఖనిజ నిక్షేపాలు ఉన్నాయో.. ఎంత మేరకు నిల్వలు అందుబాటులో ఉన్నాయో.. క్షణాల్లో కనిపెట్టే ఉపగ్రహాలు సైతం మైకా జాడ తెలుసుకోలేక పోతున్నాయి. భూగర్భంలో ఎక్కడ మైకా నిక్షేపాలు ఉన్నాయో కనిపెట్టడమే కష్టతరం. కొన్ని చోట్ల వంద అడుగుల్లోనే అభ్రకం దొరికితే.. మరికొన్ని చోట్ల వెయ్యి అడుగుల వరకు తవ్వకాలు జరిపినా ప్రయోజనం ఉండని పరిస్థితి.

100 అడుగులు దాటితేనే..

అండర్ గ్రౌండ్ మైనింగ్ చేసే వారు తప్పని సరిగా 100 అడుగుల మేర త్వవకాలను సాగించాల్సి ఉంటుంది. ఆపైనే మైకా లభ్యమవుతుంది. అది కూడా అదృష్టం మీదనే ఆధారపడి ఉంటుంది. ఓ గని యాజమాని అండర్ గ్రౌండ్ మైనింగ్‌లో మైకా వెలికితీసేందుకు రూ.2కోట్లు వెచ్చించినా ఫలితం దక్కలేదు. అదృష్టం కలిసి వస్తే వంద అడుగుల్లోనే మైకా దొరుకుతుంది. లేదంటే వెయ్యి అడుగు తవ్వినా ప్రయోజనం ఉండదు.

నాడు 147...నేడు 10..!

గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా సుమారు 147 మైకాను వెలికితీసే గనులు ఉండేవి. ప్రభుత్వం మైకా పరిశ్రమపై చిన్న చూపు చూస్తుండటంతో రోజురోజుకు భూగర్భ గనులకు కాలం చెల్లింది.అప్పట్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మంది కార్మికులు జీవనోపాధి పొందేవారు. క్రమేణా పెట్టుబడి వ్యయం పెరిగిపోవడంతో అండర్ గ్రౌండ్ మైనింగ్ దాదాపు తగ్గి పోయింది. గత మూడేళ్లలోనే గనుల సంఖ్య 27నుంచి 10కి పడిపోయింది. గనులు మూతపడుతుండడంతో కార్మికుల సంఖ్య కూడా నేడు 2వేలకు తగ్గిపోయింది. సుమారు 48 వేల మంది మైకా గని కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. అండర్‌గ్రౌండ్ మైనింగ్ భారం కావడంతో పలువురు ఓపెన్ క్వారీలుగా గనులను మార్చ తవ్వకాలు కొనసాగిస్తున్నారు.



మైకా అండర్ గ్రౌండ్ మైనింగ్

ప్రత్యేకత ఇదీ..



ఓపెన్ క్వారీ

ఈ ప్రాంతంలో లభించే మైకా ఖనిజానికి ఓ ప్రత్యేకత ఉంది. దాదాపు 800 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతను సైతం తట్టుకోగల శక్తి ఉంది. అందువల్లే ఇక్కడ దొరికే అభ్రకానికి దేశవిదేశాల్లో మంచి గిరాకీ వచ్చింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 150 కిలోమీటర్ల పరిధిలో మైకా నిక్షేపాలు ఉన్నాయి. కోడిగుడ్డు ఆకారంలో మైనింగ్ జోన్ ఏర్పడి ఉంది. ఈ ప్రాంతంలో మైకాతో పాటు వివిధ రకాల ఖనిజాలు సైతం నిక్షిప్తమై ఉన్నాయి. ఇక్కడి మైకా కేజీ గరిష్టంగా రూ.లక్ష వరకు ధర పలుకుతోంది. కేజీ రూ.10వేలు పలికే మైకా అయితే ఇబ్బడి ముబ్బడిగా అందుబాటులో ఉండడం విశేషం. గతంలో ఎందుకూ పనికిరాదనుకుని వదిలేసిన అభ్రకానికి కూడా ఇప్పుడు మార్కెట్‌లో డిమాండ్ వచ్చింది. ఇలా వృథాగా మిగిలిపోయిన మైకాను అమ్ముకునే ప్రస్తుతం పలువురు గనులను నిర్వహణ ప్రారంభించారు.

అందుబాటులో లేని టెక్నాలజీ



వెలికి తీసిన మైకాను భద్రపరుస్తున్న కార్మికులు

ఈ ప్రాంతంలో మైకా నిక్షేపాలు ఉన్నట్లు 1885లో కనిపెట్టారు. ఇక అప్పుడు గనుల నుంచి మైకాను ఎలా వెలికితీశారో ఇప్పుడు కూడా అలాగే తవ్వకాలు సాగిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని మైకా పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. ఇక్కడ మాత్రం నేటికీ ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రాలేదు. కూలీలతోనే మైకాను భూగర్భం నుంచి వెలికితీయాల్సి రావడంతో పెట్టుబడి వ్యయం అనూహ్యంగా అధికమవుతోంది. పెరిగిన ఖర్చులు, కూలీల లభ్యత కారణంగా గనుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. దీంతో దశాబ్దాలుగా ఓ వెలుగు వెలిగిన అభ్రకం పరిశ్రమ నేలచూపులు చూసే పరిస్థితి ఏర్పడింది. అయితే ప్రస్తుతం మైకా డిమాండ్ పెరుగుతుండడంతో పలువురు యువ పారిశ్రామికవేత్తలు గనుల నిర్వహణపై ఆసక్తి చూపుతున్నారు. కునారిల్లుతున్న మైకా పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అడుగులు వేస్తున్నారు. వేలాది మందికి ఉపాధి కల్పించే దిశగా ముందుకు వస్తున్నారు.

తొలి మాసంలోనే హామీలకు తూట్లు


వాకాడు : అధికారంలోకి వచ్చిన తొలి మాసంలోనే ఇచ్చిన హామీలకు టీడీపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం వాకాడులోని తన నివాసంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజల్లోనే ఉంటామన్నారు. ప్రజా పక్షానే పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ సర్కారుకే దక్కిందన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. వలంటీర్లు లేకుండా సచివాలయాల ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేశామని టీడీపీ నాయకులు పదే పదే చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం కూడా ఎవరికీ రాలేదని అసత్య ప్రచారం చేసిన పచ్చనేతలు ఇప్పుడు సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయించామని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. నేతలు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, దువ్వూరు భార్గవ్‌రామ్, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, నెల్లూరు పెంచలరెడ్డి, ఏనుగు సుధాకర్ నాయుడు, పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, పార్థసారథి, వాకాటి రవికుమార్, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

అధినేతతో ఆత్మీయ సమావేశం

నాయుడుపేటటౌన్ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లెలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. కిలివేటి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించాలని జగనన్న సూచించారన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారని వెల్లడించారు. ప్రజల వెంటే వైఎస్సార్‌సీపీ ఉంటుందని, ఆ మేరకు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని జగనన్న పరామర్శించారన్నారు. తనపై టీడీపీ నేతలు కక్షగట్టి పోలీసులతో పెట్టించిన అక్రమ కేసు, ఇబ్బంది పెట్టిన తీరును జగనన్నకు సత్యనారాయణరెడ్డి వివరించినట్లు వెల్లడించారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

సామరస్యంగా సమస్యల పరిష్కారం

- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకుందామని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక జెడ్పీ సమావేశ మందిరంలో తొలి జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. సీఈఓ గ్లోరియా ఆధ్వర్యంలో చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏ సమస్య ఉన్నా పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సీఎం, డిప్యూటీ సీఎం నుంచి పాలన పరమైన సలహాలను తీసుకొని ముందుకు వెళదామన్నారు. తొలుత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికి చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. పలుశాఖల పరంగా జరిగిన ప్రగతిని అధికారులు నివేదించారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి డీపీఓ లక్ష్మి తెలిపారు. ట్యాంకర్లను శుభ్రం చేసి ఫొటోలు పెడుతున్నారని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యుత్ సమస్యలను నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు అన్నారు. చెరువుల మరమ్మతు పనులను పూర్తి చేస్తున్నట్లు ఎస్‌ఈ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. డయేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, పలుశాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



హాజరైన ఎమ్మెల్యేలు, అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

పసుపు రంగు వేయండి

చిత్తూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులు బ్లూ రంగులో ఉన్నాయి. వాటికి పసుపు రంగు వేయాలి. అలాగే ట్యాంకర్లను శుభ్రం చేసి ఆ ఫొటోలను డీపీఓకు పెట్టే విధంగా చూడాలి. శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్ల స్థానంలో కొత్తవి కట్టాలి. జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన వ్యర్థాలను చెరువులో వేయకుండా చూడాలి. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలి.

– గురజాల జగన్‌మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

జిల్లా అధికారులు హాజరవ్వాల్సిందే

ఎమ్మెల్యేలు హాజరయ్యే సమావేశాలకు జిల్లా అధికారులందరూ సమావేశానికి హాజరుకావాల్సిందే. ఐరాల మండలంలోని ఎస్సీ కాలనీలో కరెంటు స్తంభం ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈను ఆదేశిస్తే పట్టించుకోలేదు. తవణంపల్లెలో వ్యవసాయానికి సక్రమంగా కరెంటు ఇవ్వడం లేదు. ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ అంతరాయం వస్తోంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా వాటర్ ట్యాంక్‌లను ఎందుకు శుభ్రం చేయడం లేదు. అధికారులు జెడ్పీటీసీలకు గౌరవం ఇవ్వాలి. శాఖాపరంగా అధికారులు సమాచారం ఇవ్వడం లేదు.

– మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

ఆ అధికారులను సస్పెండ్ చేస్తాం

చంద్రగిరి నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకోవాలి. వంక పోరంబోకు స్థలంలో నిర్మించిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇస్తారు. నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులు నడుచుకున్నారు. అలాంటి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఉన్నతాధికారులు నిర్ణయిస్తారు. అక్రమాలకు సహకరించిన అధికారుల సస్పెన్షన్‌కు అన్ని చర్యలూ తీసుకుంటాం. పలు ప్రాంతాల్లో ఉన్న నీటి సమస్యను పరిష్కరించాలి.

– పులివర్తినాని, చంద్రగిరి ఎమ్మెల్యే

వైద్యశాఖ తీరు అధ్వానం

పుత్తూరులో సరైన వైద్య సేవలు అందక పుట్టిన బిడ్డ చనిపోయాడు. ఇలాంటి పరిస్థితి జిల్లా అంతటా ఉంది. వైద్యశాఖ తీరు అధ్వానంగా మారింది. డాక్టర్లు ఆస్పత్రుల్లో సమయపాలన పాటించడం లేదు. నియోజకవర్గంలో అనర్హులకు సంక్షేమ పథకాలు అందించారు. వీటిని మరోసారి పరిశీలించి నివేదికను ఇవ్వాలి. ఎన్టీఆర్ జలాశయం ద్వారా 33 చెరువులను అనుసంధానం చేసి నీటిని నింపాలి. కృష్ణాపురం జలాశయం పనులు పూర్తి చేసి రైతులకు వ్యవసాయానికి సరిపడా నీరు అందించాలి.

– థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

షాడో ఎమ్మెల్యేకి 15 బ్రేక్ దర్శన టికెట్లు!

తిరుమల : తిరుమలలో సంప్రదాయాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించి.. తీరా తమకు తోచిన వారికి అత్యధిక టికెట్లు కేటాయించేలా టీటీడీపై ఒత్తిడి తెస్తోంది. సాధారణంగా టీటీడీ నియమావళి ప్రకారం రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్నవారు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖులు స్వయంగా దర్శనానికి వస్తే, వారితో పాటు వచ్చేవారికి కూడా ప్రోటోకాల్ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు జారీ చేస్తారు. వారు స్వయంగా రాకుండా కుటుంబ సభ్యులు వస్తే రెఫరల్ ప్రొటోకాల్ బ్రేక్ దర్శనం కల్పిస్తారు. అయితే తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రాకపోయినప్పటికీ, ఆయన అన్న కుమారుడు శివకుమార్‌తో పాటు మరో 14 మందికి ప్రొటోకాల్ బ్రేక్ దర్శనాలు కేటాయించారన్న వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఎంత షాడో ఎమ్మెల్యే అయినా 15 బ్రేక్ దర్శనాలు ఎలా ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏపీ 'హంస' జిల్లా గౌరవాధ్యక్షుడిగా మునిరాజా



తిరుపతి తుడా: ఏపీ హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్) జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎం.మునిరాజాను ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు రాజా తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఏపీ హంస జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కమిటీ ఎన్నిక అనంతరం గౌరవ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు రాజా వెల్లడించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.74,440
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,685
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.92,200
రిటైల్ వెండి గ్రాము	రూ.94.20

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



శ్రీకాళహస్తి: మండలంలోని అక్కుర్తి సమీపంలో బుధవారం గుర్తుతెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ప్రభుత్వాస్పత్రి మార్చురీలో మృతదేహం ఉంచినట్లు వైద్యులు తెలిపారు.

ఆర్టీసీ ఆదాయం పెంచడమే లక్ష్యం



ఏజెంట్ పాయింట్ ప్రారంభిస్తున్న డీఆర్ నాయుడు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ ఆదాయం పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు కార్గో విభాగం జిల్లా ఇన్‌చార్జి డీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం తిరుపతిలోని పద్మావతిపురంలో ఓటేరు మార్గం వద్ద కార్గో ఏజెంట్ పాయింట్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో ఏజెంట్లను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కేవలం రూ.1,000 చెల్లిస్తే కార్గో ఏజెంట్‌గా అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఇప్పటికే తిరుపతిలో 8 మంది ఏజెంట్లు ఉన్నారన్నారు. బుకింగ్‌పై 15శాతం ఏజెంట్లకు కమిషన్ ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తిగలవారు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని కార్గో పాయింట్ వద్ద సంప్రదించాలని సూచించారు. అనంతరం నూతన ఏజెంట్ విజయకుమార్‌కు పలు సూచనలు చేశారు.

‘పామ్’లో లేని ధర!

- తగ్గిన పామాయిల్ ధర
- దిగుమతి సుంకం రద్దుతోనే ధరలు పతనం
- గతేడాదితో పోల్చితే సగానికి పడిపోయిన ధరలు
- గత ఏడాది టన్ను రూ.24వేలు
- ఈ ఏడాది టన్ను రూ.13 వేలు
- జిల్లాలో 320 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు



శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీ కండ్రిగలో సాగులో ఉన్న పామ్‌ఆయిల్ పంట

తిరుపతి అర్బన్: ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనం బాట పట్టాయి. క్రూడ్ ఆయిల్‌పై కేంద్రం దిగుమతి సుంకం రద్దు చేయడం, ఇతర కారణాలతో ఆయిల్ పామ్ ధరలు భారీగా పడిపోతున్నాయి. గతేడాదితో పోల్చితే 40 శాతం మేర ధరలు తగ్గాయి. అంతర్జాతీయంగా వచ్చే 80 ఏళ్ల వరకు ఆయిల్‌పామ్‌కు విపరీతంగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతుండగా దానికి విరుద్ధంగా ధరలు పతనమవుతుండడం అన్నదాతను కలిచివేస్తోంది. ఐదేళ్ల నుంచి వరుసగా ధరలు పెరుగుతూ రాగా ఈ ఏడాది మాత్రం తగ్గుముఖం పట్టాయి. ఆయిల్‌పామ్ సాగులో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో తిరుపతి జిల్లాలో పండించే పంటను సైతం ఏలూరు జిల్లాకు ఏటా ఎగుమతి చేస్తుంటారు. వాణిజ్య పంటల్లో అగ్రగామిగా ఉన్న ఆయిల్ పామ్ సాగును తిరుపతి జిల్లాలో 2019లో 50 ఎకరాలతో మొదలై ప్రస్తుతం 320 ఎకరాల్లో సాగు చేస్తునఆనరు. మరో రెండేళ్లలో 1000 ఎకరాలు పెరగవచ్చని అధికారుల అంచనా. ఏడాదిలో రెండు సార్లు పంట చేతికి వస్తుంది. దిగుబడి తక్కువగా ఉంటే ఎకరానికి 3–6 టన్నులు, దిగుబడి బాగా ఉంటే 8 నుంచి 11 టన్నులు చేతికందుతుంది.

ఆయిల్ పామ్ ధర

సంవత్సరం	ధర రూ
2017	8,500
2018	8600
2019	7700
2020	10,000
2021	17,951
2022	26,000
2023	24,000
2024	13,180



తిరోగమనంలో ధరలు

ఆయిల్‌పామ్ ధరలు తిరోగమనంలో కొనసాగుతున్నాయి. 2017లో సగటున టన్ను రూ.8 వేలు ఉన్న ధర అంతర్జాతీయ పరిణామాలు డిమాండ్ కారణంగా 2022 నాటికి అది రూ.26 వేలకు చేరింది. ఆ తరువాత క్రూడ్ ఆయిల్‌పై దిగుమతి సుంకం రద్దు చేయడంతో ఆయిల్‌పామ్ ధర తిరోగమనం బాట పట్టింది. గతేడాది రూ.24 వేలు సగటున ఉండగా ఈ ఏడాది రూ.13,180కి చేరింది.

ధరలు తక్కువగానే ఉన్నాయి



జిల్లాలో ప్రస్తుతం పామ్ ఆయిల్ ధరలు గత ఏడాదితో పోల్చుకుంటే చాలా తక్కువగా ఉన్నాయి. మామిడి ధరలు తక్కువగా ఉండడంతో వ్యాపారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేశాం. అదే పద్ధతిలో పామ్ ఆయిల్ రైతులకు న్యాయం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. సాగు విస్తీర్ణం పెంచడానికి కృషి చేస్తున్నాం.

–దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

నాడు అక్రమం.. నేడు సక్రమం!



గ్రావెల్ లారీలకు కారును అడ్డుగా పెట్టిన టీడీపీలోని ఒక వర్గం నేతలు

- గ్రావెల్ తరలింపులో తమ్ముళ్ల గొడవలు
- వాటాల కోసం తకరారు

చిల్లకూరు : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ తరలిస్తుంటే అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని టీడీపీ నేతలు అప్పట్లో గగ్గోలు పెట్టేవారు. అయితే ఇప్పుడు పచ్చపార్టీ నాయకులే ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తూ కాసులు వెనకేసుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రావెల్, మట్టి తరలింపులను చేపట్టిన టీడీపీ శ్రేణులు మధ్య గొడవలు ఏర్పడి వివాదం తీవ్రం కావడంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఇరువర్గాలకు రాజీ కుదిర్చిట్లే తెలిసింది. తీర ప్రాంత గ్రామాలలో గ్రావెల్ బాగా దొరుకుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్‌పై కన్నేసిన ఇద్దరు టీడీపీ నేతలు ఒక్కటై తీర ప్రాంతంలోని పరిశ్రమలకు సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో నిరంతరాయంగా గ్రావెల్ తరలించేస్తుండడంతో అదే పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు అడ్డుకున్నారు. తమకు తెలియకుండా ఎలా ఒప్పందం చేసుకుంటారని గ్రామంలోని కొంత మందితో కలసి లారీలను నిలిపి వేశారు. దీంతో తమ్ముళ్ల మధ్య వివాదం ముదిరి పాకాన పడింది. మా ప్రాంతంలో ఒప్పందం చేసుకుంటే మాకు వాటా రావాలి కదా అని ఒకరు, మీకు ఎందుకు భాగం ఇవ్వాలని మరొకరు పట్టు బట్టారు. దీంతో లారీలు పూర్తిగా నిలిచి పోయి గంటల తరబడి రోడ్డుపై బారు తీరాయి. ఈ విషయం నియోజకవర్గ ప్రతినిధి దృష్టికి పోవడంతో రెండు వర్గాల నాయకులను పిలిపించి మధ్యస్థం చేసినట్లు సమాచారం. ఇకపై వివాదాల జోలికి వెళ్లకుండా పనులు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. గతంలో గ్రావెల్ తరలిస్తుంటే గగ్గోలు పెట్టిన వారే, నేడు అక్రమ రవాణాను ఆదాయ మార్గంగా ఎంచుకోవడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. అప్పుడు అక్రమమైనది.. ఇప్పుడు సక్రమంగా మారిపోతుందా అని మండిపడుతున్నారు. అయితే నవ్విపోదుకు గాక మాకేంటి.. అనుకుంటూ టీడీపీ నేతలు మాత్రమ తమ జేబులు నింపుకునే పనిలోనే నిమగ్నం కావడం గమనార్హం.

శ్రీసిటీ సందర్శనలో ఐఆర్‌ఎస్‌లు



శ్రీసిటీ ఎండీతో మాట్లాడుతున్న అధికారులు

శ్రీసిటీ(వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామిక వాడను ఐఆర్ఎస్ అధికారులు గోరసే ప్రసాద్ దత్తాత్రయ, కంచన్ రామ్ మీనా బుధవారం సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. పారిశ్రామిక నగరం, ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలపై ఐఆర్ఎస్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పచ్చని వాతావరణంలో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేయడంపై అభినందించారు.

పరికరాల సరఫరాకు టెండర్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలోని సొసైటీ ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఎస్ఎస్ఐఐఈ) టెక్నాలజీ ఇంక్యుబేటర్ కోసం ఎఫ్ఏబీ ల్యాబ్ సరఫరా, ఇన్‌స్టలేషన్ పరికరాల కోసం ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. టెండర్ల దరఖాస్తుల స్వీకరణ ఈనెల 5 నుంచి ప్రారంభమై 29వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులతో అగ్రపథం

- పాడి పరిశ్రమ అభివృద్ధిలో ఏపీ ఫస్ట్
- మహిళల భాగస్వామ్యమే కారణం
- కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి వర్షాజోషి



శ్రీజ డెయిరీ సభ్యులకు మెగా చెక్ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి వర్షా జోషి

తిరుపతి రూరల్/తిరుపతి అర్బన్ : ఆధునిక పద్ధతులు పాటించడంతోనే పాల ఉత్పత్తిలో ఏపీ అగ్రపథాన పయనిస్తోందని, మహిళల భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని కేంద్ర ప్రభుత్వ పశుసంవర్థక, పాడి పరిశ్రమశాఖ అదనపు కార్యదర్శి వర్షా జోషి తెలిపారు. బుధవారం తిరుపతిలో నిర్వహించిన శ్రీజ డెయిరీ పదో వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీజ డెయిరీ సభ్యులకు రూ.11.12 కోట్ల ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. వర్షా జోషి మాట్లాడుతూ 1.20 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా యాజమాన్యంలోని పాల ఉత్పత్తి సంస్థగా శ్రీజ డెయిరీ ఎదిగిందని కొనియాడారు. ఈ సంస్థ రోజుకు 8 లక్షల లీటర్ల పాలను సేకరిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా పాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన పురోగతిని సాధించిందని, శ్రీజ వంటి సంస్థలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. పాల ఉత్పత్తిలో ఏపీ ప్రస్తుతం దేశంలోనే 5వ స్థానంలో ఉందని, మొదటి 3 స్థానాలనులక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పశుసంవర్థక శాఖ గణాంకాల ప్రకారం ఏపీలో పాల ఉత్పత్తి 2014–15లో 96.56 లక్షల టన్నులు ఉండగా, 2022–23 నాటికి 1.54 కోట్ల టన్నులకు పెరిగిందని వివరించారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ మీనేష్ షా మాట్లాడుతూ శ్రీజ డెయిరీ పదేళ్ల పూర్తి చేసుకున్నందుకు, ఆ మార్గంలో అనేక మైలురాళ్లను అధిగమించినందుకు రైతులను అభినందించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కో–ఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్‌లోని మిల్క్‌షెడ్ ప్రాంతంలో కార్యకలాపాలను శ్రీజ ప్రారంభించిందని, ఆ తర్వాత పొరుగు రాష్ట్రాలతో సహా పన్నెండు జిల్లాలకు విస్తరించిందని వివరించారు.

‘ఆరణి’ వైఖరి అప్రజాస్వామికం



రాయపనేని హరికృష్ణ

తిరుపతి కల్చరల్ : తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వైఖరి అప్రజాస్వామికమని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర పాలక సంస్థ అధికారుల సమావేశంలో కమిషనర్ అదితి సింగ్ పక్కన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు శివకుమార్ కూర్చుని సమీక్షించడం దారుణమన్నారు. దీనిపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెంటనే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా అధికారులతో సమావేశాలు నిర్వహించి నగర అభివృద్ధికి పాటుపడాల్సిన ఆరణి తనకు బదులుగా వేరొకరిని పంపించడం చట్ట వ్యతిరేకమన్నారు. ఇలాంటి చర్యలు అవినీతిని ప్రోత్సహిస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ ఎమ్మెల్యేగా పని చేసిన ఆరణి శ్రీనివాసులుకు ఇంత చిన్న విషయం తెలియదా ? అని ప్రశ్నించారు. శాసనసభకు కూడా ఇకపై తనకు బదులుగా శివకుమార్‌నే పంపిస్తారా అని నిలదీశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను విస్మరించి కుటుంబ సభ్యులకి పెత్తనం అప్పగిస్తే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్యేకు బదులుగా సమావేశానికి ఆయన అన్న కుమారుడిని ఐఏఎస్ అధికారి అదితి సింగ్ ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. అయ్యా ఎస్ అనే పరిస్థితి ఐఏఎస్‌లకు రాకూడదని సీఎం, డిప్యూటీ సీఎం చెబుతుంటే అందుకు విరుద్ధంగా నడుచుకోవడం క్షమార్హం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు కమిషనర్ అదితి సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వంతోపాటు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో ముమ్మర తనిఖీలు



పార్శిల్ ఆఫీసులో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: జిల్లాలో గంజాయి నిర్మూలన కోసం పోలీసులు ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నారు. బుధవారం అందులో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ సర్వీసులు, లగేజీ ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ సర్వీసు కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ కొరియర్, రైల్వే స్టేషన్ పార్శిల్ సర్వీసులు, నవత భారత్ మోటార్ పార్శిల్ సర్వీస్, రేణిగుంట రోడ్‌లోని పార్శిల్ సర్వీసులో తనిఖీలు చేసి అనుమానాస్పదంగా కనిపించిన ప్యాకెట్లను పరిశీలించారు. ఎస్బీ డీఎస్పీ వెంకటాద్రి పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం




జీజే యశ్విన్‌కుమార్, బేరి భారత్




ఎస్.మోహిత్, ఎస్.వంశితశ్రీ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ ఏడాది జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష రెండో జాబితాలో విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ ఫలితాల్లో జీజే యశ్విన్‌కుమార్, బేరి భారత్, ఎస్.మోహిత్, ఎస్.వంశితశ్రీ సీట్లు సాధించారు. వీరితో మొత్తం నవోదయ విద్యాలయాల్లో ఈ ఏడాది తమ విద్యార్థులు 52మంది సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. గత 34 ఏళ్లుగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తుండడంతో తమ విద్యా సంస్థకు గర్వకారణమని తెలిపారు. అనంతరం విద్యార్థులను విశ్వనాథ రెడ్డి, ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్‌రెడ్డి అభినందించారు.

కరాటే పోటీలో పవన్ ప్రతిభ



క్రీడాకారులతో కోచ్ నవీన్

తిరుపతి ఎడ్యుకేషన్: మలేషియాలోని కౌలాలంపూర్‌లో జూన్ 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన 23వ మైలో ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతికి చెందిన క్రీడాకారుడు చీమల పవన్‌కుమార్ సత్తా చాటారు. ద్వితీయ స్థానం దక్కించుకుని రజతం పతకం సాధించాడు. అలాగే తిరుపతికి చెందిన క్రీడాకారులు సి.మిథిల్‌నరేష్, బండారు మిత్ర, కె.పవన్‌కుమార్, ఎస్.సూర్య, నైతిక్ జైన్, డి.కృషి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరిని కోచ్ పి.నవీన్ అభినందించారు.

బాధ్యతాయుతంగా విధులు



పాకాల పోలీసుస్టేషన్ వద్ద ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చంద్రగిరి : పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదీలతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు. బుధవారంచంద్రగిరి, పాకాల పోలీసు స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. శాంతిభద్రతల సమస్యలు ఏమైనా ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసులపై గౌరవాన్ని పెంచే విధంగా ప్రవర్తన ఉండాలన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించాలని, స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని తెలిపారు. నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు రామయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం



నాయుడుపేటటౌన్ : మండలంలోని పండ్లూరు సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం (35) లభ్యమైనట్లు గూడూరు రైల్వే ఎస్ఐ కొండప్పనాయుడు బుధవారం తెలిపారు. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. మృతుడి ఒంటిపై డార్క్ బ్లూ కలర్ ఫుల్‌హ్యాండ్ షర్ట్, లైట్ బ్లూ కలర్ లుంగీ ఉన్నాయని, చేతిపై జాన్ సీనా అని పచ్చబొట్టు ఉందని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 70134 00429 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.